గురువారం
16 జూలై 2020

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 03
సంచిక : 136
పేజీలు: 4
వెల: రూ.3/-

Website: www.subhatelangana.in

RNI No: TELTEL/2017/72695

శుభ తెలంగాణ

మేడ్చల్ - హైదరాబాద్

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar.

కేసీఆర్ సర్కారుపై హైకోర్టు సీరియస్

- కరోనాపై మరోమారు హైకోర్టు కీలక ప్రకటన
- టెస్టులు, చికిత్సల వివరాలు ప్రకటించాలని ఆదేశం
- చీఫ్ జస్టిస్ సూచనలను బేఖాతర్ చేయడంపై ఆగ్రహం

హైదరాబాద్, జూలై 15(శుభ తెలంగాణ):



కరోనా చికిత్సలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు కీలక సూచనలు చేసింది. సాధారణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఎక్కడెక్కడ కరోనా టెస్టులు, చికిత్సలు చేస్తున్నారో ప్రకటించాలని ఆదేశించింది. చీఫ్ జస్టిస్ సూచనలను కూడా పాటించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కరోనా వచ్చిన వారికి ప్రభుత్వం ఎలాంటి చికిత్స అందిస్తోందో తెలపాలని తెలంగాణ

- కొనసాగింపు 2లో..

ఉస్మానియా సాగర్!

- భారీ వర్షంతో ఉస్మానియా ఆసుపత్రి వార్డుల్లోకి చేరిన వరదనీరు
- డ్రైనేజీ నీరు కలవడంతో కంపు కొడుతున్న వార్డులు
- తక్షణం సహాయక చర్యలు తీసుకోవాలని రోగుల డిమాండ్

నేడు బీజేపీ ఉస్మానియా సందర్శన


హైదరాబాద్, జూలై15(శుభ తెలంగాణ):

ఉస్మానియా ఆస్పత్రిలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. భారీ వర్షానికి ఆస్పత్రుల్లో నీరు చేరింది. డ్రైనేజీ నీటితో వాన నీళ్లు కలిసిపోయాయి. అనూహ్యంగా నీళ్లు చేరడంతో వార్డులన్నీ నీటిలో తేలుతున్నట్లుగా ఉంది. ఈ పరిస్థితినిచూసిన రోగులు బెంబేలెత్తిపోతున్నారు. ఆస్పత్రుల్లో మురుగు నీటి వ్యవస్థ దారుణంగా ఉందని ఆరోపిస్తున్నారు. నీటిలో నుంచి వచ్చి వైద్యం చేయడానికి సిబ్బంది నిరాకరించారు. ఉస్మానియా ఆస్పత్రి ప్రాంతంలో నిజాం కాలం నాటి డ్రైనేజీ ఉంది. ఆస్పత్రిని ఆధునీకరిస్తామని కూల్చి వేసి కొత్తది నిర్మిస్తామన్నారు. కానీ ఇంతవరకూ

- కొనసాగింపు 2లో..



కేటీఆర్ దృష్టిలో పడేందుకు.. నేతల పాట్లు!



-గ్రేటర్‌లో అధికార టీఆర్ఎస్‌లో నేతల పోటాపోటీ
- మాధవరం,గాంధీ మధ్య కోల్డ్ వార్‌పై పార్టీలో గుసగుసలు

హైదరాబాద్, జూలై15 (శుభ తెలంగాణ) :

నగరంలో గ్రేటర్ ఎన్నికలకు మరో ఏడాది ఉన్నా అప్పుడే రాజకీయాలు మొదలయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల మధ్యపోటీ నెలకొంది. దీనికితోడు మంత్రి కెటిఆర్ నిత్యం రాజదాని రాజకీయాలను నేరుగా పరిశీలిస్తున్నారు. ఎక్కడ ఏం జరిగిందో తెలుసు కుంటున్నారు. కరోనా కారణంగా ఆయన ప్రతి విషయాన్ని తెలుసుకుంటున్నారు. నేతల మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నా సమించేది లేదని హెచ్చరిస్తున్నారు.కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో ఇటీవల కరోనా కారణంగా ఇద్దరు ఎమ్మెల్యేలు పోటీ పడి సహాయక కార్యక్రమాలు చేపట్టారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య ఆధిపత్య పోరు ఉందన్న విషయమై ఉత్కంఠగా చర్చించుకుంటారు. ఈ రెండు నియోజకవర్గాలు పక్కపక్కనే ఉంటాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోనే ఉన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు వీరి మధ్య విభేదాలు ఇప్పుడు తారాస్థాయికి చేరాయని చర్చించుకుంటున్నారు.

- కొనసాగింపు 2లో..

కరోనా పేషేంట్లకు లక్షల్లో బిల్లులు

- వడ్డిస్తున్న తులసి హాస్పిటల్ యాజమాన్యం..

హైదరాబాద్, జూలై15(శుభ తెలంగాణ):

హైదరాబాద్ కుషాయిగూడ తులసి హాస్పిటల్‌లో కరోనా పేషంట్లకు రోజుకు లక్షకు చేరువగా బిల్లులు. సామాన్య ప్రజలు ఆస్పత్రిలో చేరేముందు సాదారణ బిల్ చార్జీలు చెప్పి చేరిన తరువాత 3,4 రోజుల వ్యవధిలోనే 3 నుండి 4 లక్షల వరకు బిల్లులు బాదుతున్నారు. తాజాగా ఓవ్యక్తి తన తల్లికి కోవిడ్ లక్షణాలు ఉన్నాయని తులసి హాస్పిటల్‌కి తీసుకువెల్లమని ధమ్మాయిగూడ స్థానిక డాక్టర్ తెలపడంతో అతను ఆసుపత్రికి తీసుకువెల్లగా అతనికి సాధారణ బిల్లులు చెప్పి లక్షల్లో బిల్లులు

- కొనసాగింపు 2లో..



ఉద్యోగ ప్రాధాన్యాలు మారుతున్నాయి

స్కిల్స్ పెంచుకోండి

- నైపుణ్యం ఉంటే ప్రపంచం మీ చేతుల్లో ఉన్నట్లే..
- నైపుణ్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగం



న్యూఢిల్లీ, జూలై15 :
వేగంగా మారుతున్న ప్రపంచంలో, అనేక

- కొనసాగింపు 2లో..

కొండెక్కుతున్న.. కూరగాయల ధరలు

- ఉత్పత్తి తగ్గడంతో ధరలకు రెక్కలు..



కేటీఆర్ తూర్పు హైదరాబాద్‌కు మరిన్ని ఐటి పరిశ్రమలు

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న శుభ తెలంగాణ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడిషన్ ఇన్‌చార్జ్‌లు, జిల్లాల వారీగా బ్యూరో ఇన్‌చార్జులు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జులు. మండలాలకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ :
7799911110

ప్రభుత్వాసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం

- కరోనా పట్ల నిర్లక్ష్యం తగదు
- మాస్కులు ధరించాల్సిందే..దూరం పాటించాల్సిందే
- సిద్దిపేటలో వందపడకల కోవిడ్ ఆస్పత్రి ప్రారంభం



సిద్దిపేట, జూలై 15(శుభ తెలంగాణ):

మాకేం కాదులే..మాకు సోకదులే ...అన్న విధంగా కరోనా పట్ల నిర్లక్ష్యం వద్దని, ప్రజలంతా మాస్కులు తప్పని సరిగా ధరించాలని మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. లాక్‌డౌన్ ఉన్నట్టుగానే భావించి అవసరమైతే తప్ప

- కొనసాగింపు 2లో..

www.subhatelangana.in
subhatelangana.app

శుభ తెలంగాణ
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

ఉస్మానియా సాగర్!

- మొదటిపేజీ కొనసాగింపు..

ఆచరణకు నోచుకోలేదు. దీంతో ఆస్పత్రి సురక్షిత ప్రాంతంలో లేదనే వాదన వినిపిస్తోంది. వర్షాలు వస్తే చాలు గేటు లోపలికి నీళ్లు వచ్చేస్తున్నాయి. ఇదిలావుంటే రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో బుధవారం మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, కూకట్‌పల్లి, మూసాపేట, జేఎన్ టీయూ, ప్రగతినగర్, ఉప్పల్, నాగోల్, ఈసీఐఎల్, చిక్కడపల్లి, బాలానగర్‌లో భారీ వర్షం పడుతోంది. భారీ వర్షం కారణంగా పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో పలుచోట్ల భారీగా వర్షం కురవడంతో చెరువుల్లోకి భారీగా వరద ప్రవాహం చేరుతుంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు సంగారెడ్డి జిల్లా అన్నసాగర్ లో 15.3 సెం.మీ, సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 12 సెం.మీ, కామారెడ్డి జిల్లా సోమూర్ లో 10.6 సెం.మీ, భద్రాద్రి జిల్లా సీతారామపట్నంలో 9.6 సెం.మీ, మేడ్చల్ జిల్లా బాలానగర్ లో 8.7 సెం.మీ, సంగారెడ్డి జిల్లా కాంగెటిలో 8.7 సెం.మీ, కామారెడ్డి బిచుకుందా 8.6 సెం.మీల వర్షపాతం నమోదైంది.

ఉస్మానియా దుస్థితిపై రాజాసింగ్ ఆగ్రహం

ఉస్మానియా ఆస్పత్రి గురించి ఎవరికి చెప్పాలో? ఏమి చెప్పాలో అర్థం కావడం లేదని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తాను ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించిన సందర్భంలో డాక్టర్లు హెల్మెట్లు పెట్టుకొని ట్రీట్ మెంట్ చేయడాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రి ఎప్పుడు కూలిపోతుందో తెలియడంలేదని, చిన్నపాటి వర్షానికే వరదలా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కు ప్రజల ప్రాణాల గురించి కనీస ఆలోచనలేదని విమర్శించారు. ఆస్పత్రిలో రోగులు, డాక్టర్లు ఇబ్బందిపడుతుంటే కేసీఆర్ చూసేందుకు రాకపోవడం ఏంటని రాజాసింగ్ ప్రశ్నించారు. హెల్త్ మినిస్టర్ తో సహా రాష్ట్రంలో ఉన్న మంత్రులు రబ్బర్ స్టాంప్ లే..వాళ్ళ వల్ల ఏమి కాదని దుయ్యబట్టారు. కేసీఆర్ నిర్లక్ష్యం వీడి..ఉస్మానియా ఆస్పత్రికి ఇచ్చిన హామీల్ని నెరవేర్చాలని, రాజకీయాలు పక్కనపెట్టి ప్రజల కోసం ఉస్మానియా ఆస్పత్రిలో రోగులకు సరైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కూలిపోతే ప్రజలు కేసీఆర్ పై మర్డర్ కేసు పెడతారని ఎమ్మెల్యే రాజాసింగ్ సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. ఇదిలావుంటే గురువారం బిజెపి నేతలు ఉస్మానియాను సందర్శించాలని నిర్ణయించారు. బండి సంజయ్, లక్ష్మణ్, రామచంద్రారావు తదితరులు ఆసుపత్రిని సందర్శిస్తారు.

కేటీఆర్ దృష్టిలో పడేందుకు..

- మొదటిపేజీ కొనసాగింపు..

టీఆర్ఎస్‌లోకి రాకమునుపు ఇద్దరు నేతలు తెలుగు దేశం పార్టీలో ఉండేవారు. మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్‌గా చేశారు. గాంధీ టీడీపీలో చురుకుగా ఉండేవారు. ఆ సమయంలోనే ఇద్దరి మధ్య సంబంధాలు అంతంత మాత్రంగా ఉండేవట. 2014లో కృష్ణారావు కూకట్‌పల్లి, గాంధీ శేరిలింగంపల్లి నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా గెలిచారు. తర్వాత ఇద్దరూ గులాబీ కండువా కప్పేసుకున్నారు. 2018 ఎన్నికల్లో ఇద్దరూ టీఆర్ఎస్ టికెట్ పై మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కరోనా సమయంలో తమ ప్రాంతాల్లోని ప్రజలకు తోచిన విధంగా పేదలకు సాయం చేశారు. రోజువారీ కూలీలకు ఆర్థిక సాయం అందించారు. భోజనాలకు ఇబ్బంది లేకుండా ఆహార పొట్లాలు పంపిణీచేశారు. ఇళ్లకు వెళ్లి నిత్యావసరాలు ఇచ్చారు. హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీతోపాటు మరో డివిజన్‌లో సైతం మాధవరం కృష్ణారావు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. కృష్ణారావు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్నప్పటి నుంచీ ఈ డివిజన్‌లలో ఆయనకు కేడర్ ఉందని చెబుతారు. అందువల్లే ఆయా డివిజన్‌లలోనూ సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. అయితే అసలు తిరకాసు ఇక్కడే ఉంది. హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, మరో డివిజన్ శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. తన నియోజకవర్గంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఎలా సహాయ చర్యలు చేపడతారని శేరిలింగం పల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారని అంటున్నారు. అసలే ఒకరంటే మరొకరికి పడని పరిస్థితి ఉండగా.. ఈ పరిణామాలు ఇద్దరి మధ్య గ్యాప్ మరింత పెంచాయని, పార్టీ వర్గాలు కూడా ఈ అంశంపై రకరకాల కామెంట్స్ చేస్తున్నాయి. అయితే ఈ వ్యయహారం మంత్రి కెటిఆర్‌కు చేరవేశారని తెలుస్తోంది.

ముంబైని ముంచెత్తుతున్న వరదలు

ముంబై, జూలై15 :

- మహారాష్ట్రలో ఎడతెరిపిలేకుండా వర్షాలు

మహారాష్ట్రలో గత కొన్ని రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి. ఓ వైపు కరోనాతో పోరాడుతున్న సమయంలో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని చాలా ఏరియాల్లో రోడ్లపై భారీగా వరదనీరు నిలిచింది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ముంబై వాసులు అత్యవసరం అయితే తప్ప బయటికి రావద్దని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు కోరారు. రోడ్లపై భారీగా నిలిచిన వరద నీటిని తొలగించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, వాహనదారులు ఎవరూ ముంపు ప్రాంతాలవైపు రావద్దని బీఎంసీ హెచ్చరించింది. కాగా, నగరంలోని కింగ్స్ సర్కిల్ ఏరియాలో భారీగా వరదనీరు నిలిచింది. దీంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో రు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువనున్నట్లు భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) హెచ్చరించింది. కొంకణ్ తీరంతో పాటు ముంబై, థానేలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొంకణ్ తీరాన్ని తీవ్రమైన మేఘాలు కమ్ముకున్నట్లు తెలిపింది. ముంబై, థానేలో 200 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానున్నట్లు పేర్కొంది. భారీ వర్ష సూచన నేపథ్యంలో భారత వాతావరణ కేంద్రం మహారాష్ట్రలోని ముంబై, థానే, రాయ్‌గడ్, పాల్ఘర్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే రెండు రోజులు ఈ ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ముంబైలోని కొలాబా ప్రాంతంలో ఈ ఉదయం 25 మి.మీ వర్షం నమోదైంది. అదేవిధంగా పాల్ఘర్ లో సుమారు 124 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మొత్తం మహారాష్ట్రలో 6 మిమీ నుండి 184 మిమీ వర్షపాతం ప్రస్తుతానికి నమోదైంది. నిరంతర వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలైన హిందూమాత, సియోన్, గాంధీ మార్కెట్, దాదర్ టిటి, వడాలాలోని షక్కర్ పంచాయతీ చౌక్, ధారావిలోని పలు ప్రాంతాలు, వడాలా ర్ స్టేషన్, పరేల్‌లోని పలు ప్రాంతాలు, చెంబూర్, కుర్లా, అంధేరి సబ్వే వంటి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

టీవీ ఛానల్‌లో పనిచేస్తున్న..

యువతి ఆతహ్మత్య..

హైదరాబాద్,జూలై15(శుభ తెలంగాణ) : ప్రేమ విఫలమైందన్న మనస్తాపంతో ఓ న్యూస్ చానెల్‌లో పనిచేస్తున్న యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్, గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిద్దిపేటకు చెందిన పి.రాములు కుమార్తె కల్యాణి (26), ఓ న్యూస్ చానెల్ లో విధులు నిర్వహిస్తూ,గత రెండేళ్లుగా అదేచానెల్ లో పనిచేస్తున్న శివ అనే యువకుడి తో ప్రేమలో ఉంది. ఇటీవల తనను వివాహం చేసుకోవాలని కల్యాణి, శివను కోరగా, అతను నిరాకరించాడు. దీంతో తాను బతకడం వృథా అని భావించిన ఆమె, ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకుని మరణించింది. తన సోదరుడితో కలిసి ఆమె ఇక్కడ ఉంటుండగా, అతను విధులు ముగించుకుని వచ్చేసరికి కల్యాణి మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరిలించి, పోస్ట్ మార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. తన కుమార్తె మృతికి శివ కారణమన్న ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామని తెలిపారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్లతో సిఎస్ సోమేశ్ కుమార్ సమీక్ష

హైదరాబాద్,జూలై 15(శుభ తెలంగాణ): వర్షాకాలం సీజన్‌కావడంతో గ్రామా లు, పట్టణాల్లో పారిశుద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సిఎస్ సోమేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు.అదేవిధంగా పారిశుధ్యం, క్రిమి సంహారక మందులను చల్లడం, లార్వా నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.పట్టణ ప్రగతి, రైతు వేదిక నిర్మాణాలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా విలీనం అయిన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మునిసిపాలిటీల చట్టం ప్రాముఖ్యతనిస్తుందన్నారు.విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయా ల కల్పనను కలెక్టర్లు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. రైతు వేదికలకు సంబంధించి మిగిలిన అన్ని అనుమతులు ఈ నెల 18 వరకు వస్తాయని అనంతరం పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలన్నారు. రైతు వేదిక నిర్మాణాలను పరిశీలించేందుకు సీనియర్ అధికారులను నియమించాలన్నారు. అన్ని రైతు వేదిక నిర్మాణాలను 2020అక్టోబర్ 10వలోగా పూర్తి చేయాలన్నారు. రైతు బంధు సమస్యలు,కల్లాల నిర్మాణం, గోడౌన్ల నిర్మాణం, ప్రత్యేక ఆహార ప్రాసెసింగ్ జోన్లకు సంబం ధించిన అంశాలపై సైతం సీఎస్ భేటీలో సమీక్షించారు. ముఖ్యమంత్రి కె చంద్ర శేఖర్ రావు ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి పనిచేయాలని ఆయన కలెక్టర్లను కోరారు.ఈ సమావేశంలో పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, పీఆర్ అండ్ ఆర్డీ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ రఘునందన్ రావు, పురపాలకశాఖ డైరక్టర్, కమిషనర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా పైడిపాల:ఎర్రబెల్లి

వరంగల్ ప్రతినిధి, జూలై 15(శుభ తెలంగాణ): నగరంలోని పైడిపల్లి ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయుటకు ప్రణాళిక రచించాలని రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మాత్యులు ఎర్రబెల్లి దయాకర రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన వర్ధన్నపేట శాసనసభ్యులు అరూరి రమేష్, వరంగల్ నగర మేయర్ గుండా ప్రకాశ్ రావుతో కలసి నగరంలోని 1వ డివిజన్ పైడిపల్లి లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యులు అరూరి రమేష్ ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు న్నాయని వాటిని అభివృద్ధి చేయాలని మంత్రి కేటీఆర్ కు విన్నవించగా కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని సందర్శించడం జరిగిందని మంత్రి తెలిపారు. నగరానికి దగ్గరగా ఉన్నందున సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమిలో అన్ని విధాలా అభివృద్ధి చేయుటకు వారం రోజుల్లోగా ప్రణాళికకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించా రు. దీని ద్వారా ఈప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చని అన్నారు. ఇదివరకే 18 ఎకరాల భూమి మునిసిపల్ కార్పొరేషన్ కు ఒప్పజెప్పడం జరిగిందని, మిగిలిన 32 ఎకరాలు కార్పొరేషన్ కు ఒప్పజెప్పి అభివృద్ధి చేస్తామని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరురి రమేష్ మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఆదేశించిన మేరకు, వర్ధన్న పేట నియోజకవగంలోని విలీన గ్రామాల్లో ప్రతి గ్రామంలో ఒక ప్రదేశాన్ని,ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంకాకుండా అభివృద్ధిచేస్తున్నట్లు అందులో భాగంగా బెస్తాం చెరువులో స్మృతి వనం, చింతగట్టు,పైడిపల్లిలలో అభివృద్ధికి శ్రీకారంచుట్టి అతి త్వరలో విజయవంతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు,కార్పోరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కోయంబత్తూరు కలెక్టర్‌కు కరోనా

చెన్నై,జూలై15 : తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కే రాజమణికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.సోమవారం ఉదయం నుంచి కలెక్టర్ జ్వరంతో బాధపడుతుండగా మంగళవారం ఆయనకు కరోనానిర్ధారణ పరీక్షలు చేశారు. కలెక్టర్‌కు కరోనా సోకినట్లు బుధవారం జిల్లా వైద్యాధికారులు తెలిపారు. కోవై మెడికల్ సెంటర్ అండ్ హాస్పిటల్‌లో కలెక్టర్ కరోనా చికిత్స తీసుకుంటున్నారు. కరోనా నియంత్రణ నేపథ్యంలో కలెక్టర్ కంటైన్మెంట్‌జోన్లలో పర్యటించారని జిల్లా వైద్యాధికారి రామదురై మురుగన్ తెలిపారు. కలెక్టర్‌లో కరోనా లక్షణాలేవీ కనిపించలేదని చెప్పారు.తమిళనాడులో కరోనాకేసులసంఖ్య 1,47,324కు పెరిగింది. ప్రస్తుతం 47,915 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 2,099 మంది చనిపోయారు.

పోస్ట్ కోవిడ్ బోగీతో సిద్ధమైన రైల్వేశాఖ

న్యూఢిల్లీ,జూలై15 : కరోనా నేపథ్యంలో సురక్షిత ప్రయాణం కోసం భారతీయ రైల్వేశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. 'పోస్ట్ కోవిడ్ బోగీ' పేరుతో మెరుగైన సదుపాయాలతో రైలుబోగీని రూపొందించింది. చేతులతో తాకాల్సిన అవసరంలేకుండా సరికొత్త సదుపాయాలు, రాగిపూత పూసిన హ్యాండ్ రెయిలింగ్స్, తలుపుల గడియలు, ఏసీ బోగీల్లో గాలి శుద్ధీకరణ వ్యవస్థ, టిటేనియం డై ఆక్సైడ్ పూత తదితర ఏర్పాట్లు చేశారు. రైలు ప్రయాణాల్లో కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందకుం డా నివారించేందుకు భారతీయ రైల్వేశాఖ పలు చర్యలు తీసుకున్నది. కపూర్తలా లోని రైలు బోగీల తయారీ కర్మాగారం ఈ విభిన్నమైన బోగీని రూపొందించింది.

హైకోర్టు సీరియస్

- మొదటిపేజీ కొనసాగింపు..

ప్రభుత్వాన్ని హైకోర్టు బుధవారం ఆదేశించింది. కరోనా చికిత్సకు సంబంధించి హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. రాష్ట్రంలో ఎక్కడెక్కడ కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని హైకోర్టు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కింగ్ కోఠి, గాంధీ, చెస్ట్ ఆస్పత్రుల్లో అత్యవసర పేషెంట్లకు చికిత్స అందిస్తున్నామని ప్రభుత్వం ఈ సందర్భంగా కోర్టుకు తెలిపింది. లక్షణాలు తక్కువగా ఉన్నవారికి పేషెంట్లకు సరోజిని దేవి, ఆయుర్వేదిక్, నేచర్ క్యూర్ ఆస్పత్రులలో చికిత్స అందిస్తున్నామని చెప్పింది. ప్రసార మాధ్యమాల్లో ఎక్కడెక్కడ కరోనా పరీక్షలు చేస్తున్నారో తెలపాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. సాధారణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ లేకుండా వ్యవహరిస్తోందని హైకోర్టు పేర్కొంది. చీఫ్ జస్టిస్ చెప్పిన సూచనలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించాలని మరోసారి ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

కరోనా పేషేంట్లకు లక్షల్లో బిల్లులు

- మొదటిపేజీ కొనసాగింపు..

వద్దించారు కంగు తిన్న సదరు వ్యక్తి ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆడిగితే మొత్తం డబ్బులు కట్టి తన తల్లిని తీసుకువెల్లమని దాబాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో ఉద్యోగాలు లేక పనులు లేక ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలను మాయ మాటలతో చేర్చుకుని లక్షల్లో కట్టమంటే ఎక్కడినుండి తీసుకువస్తామని ప్రశ్నిస్తున్నారు. ఇదే ఆస్పత్రిలో మరో వ్యక్తి ఓ క్యాబ్ డ్రైవర్ తన తల్లికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండడంతో తులసి ఆస్పత్రిలో 3 రోజుల క్రితం తులసి ఆస్పత్రికి తీసుకువెల్లగా వారికి సాధారణ చార్జీలు చెప్పి చేరిన తరువాత సీన్ మార్చేసి 4 రోజుల్లో 3.7 లక్షలు బిల్లు చేతిలో పెట్టారు. తన తల్లి బుధవారం ఉదయం 6 గంటలకు మృతి చెందగా మరో వైపు బిల్లు కడితేనే డేడ్బాడీని ఇస్తామని తులసి ఆస్పత్రి యాజమాన్యం చెబుతుంది. ఇలాంటి హాస్పిటల్ పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్,జూలై 15(శుభ తెలంగాణ): దేవరకద్ర ఎమ్మెల్యే ఆల్ల వెంకటేశ్వర్ రెడ్డి గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటారు. మంత్రి నిరంజన్‌రెడ్డి విసిరిన గ్రీన్ ఛాలెంజ్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలోని ఎల్లమ్మగుట్ట వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీసంతోష్ కుమార్ శ్రీకారం చుట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో తనను భాగస్వామ్యం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం యావత్ దేశం మొత్తం ప్రాచుర్యం పొందిందన్నారు. నాటిన మొక్కలను వందకు వంద శాతం బ్రతికించుకోవాలన్నారు. ఎల్లమ్మగుట్ట దగ్గర 10 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రమంలో భాగంగా ఈ రోజు 2 వేల మొక్కలను నాటడం జరిగిందన్నారు. వారం రోజుల్లో మొత్తం 10వేల మొక్కలు నాటనున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరో ముగ్గురికి గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు. జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, భూత్పూర్ ఎంపీపీ కదిరే శేఖర్ రెడ్డికి గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు.

శ్రీశైలానికి భారీగా వరదనీరు

- జూరాల నుంచి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

కర్నూల్, జూలై 15(శుభ తెలంగాణ): శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో.. నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు తెరిచారు. దీంతో జూరాలకు వరద పోటెత్తింది. అక్కడ్నుంచి శ్రీశైలయానికి కృష్ణమ్మ పరుగులు పెడుతోంది.క్రమక్రమంగా వరద పెరుగు తుండటంతో శ్రీశైలానికి భారీగా వరద నీరువచ్చి చేరుతోంది. బుధ వారం ఉదయం 49,895 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశ యానికి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి 48,795 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 1100 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 815.50 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 37.6570 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల జలాశయానికి 60వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో జూరాల నుంచి 55వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 318.440 మీటర్లకు చేరింది. జూరాల నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ9.500 టీఎంసీలుగా ఉంది.

ప్రభుత్వాసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం

- మొదటిపేజీ కొనసాగింపు..

ఎవరూ బయటకు రావొద్దని ప్రజలకు సూచించారు. కరోనా మరణాల రేటు చాలా తక్కువగా ఉందని, తెలంగాణలో కూడా మరణాల సంఖ్య చాలా తక్కువగా ఉందని మంత్రి చెప్పారు. కరోనా పాజిటివ్ వచ్చినా ఆందోళన చెందకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. సిద్దిపేటలో 100 పడకల కోవిడ్-19 ఆస్పత్రిని మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. కోవిడ్ నియంత్రణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని, ప్రతిరోజూ పరిస్థితిని సమీక్షించి వైద్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ కు, అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని మంత్రి హరీష్ రావు అన్నారు. కరోనా లక్షణాలు కనిపిస్తే భయంతో వెళ్లి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరి డబ్బును నష్టపోవద్దని మంత్రి హరీష్ రావు సూచించారు. కరోనాకు ఎక్కడయినా ఒకటే వైద్యమని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మంచి వైద్యం అందిస్తున్నారని మంత్రి చెప్పారు. డాక్టర్లు, సిబ్బంది గొప్పగా పని చేస్తున్నారని మంత్రి హరీష్ రావు అన్నారు. కరోనా నేపథ్యంలో ప్రజలు విచ్చలవిడిగా వ్యవహరించ వద్దని, ఫంక్షన్ లు సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. వనభోజనాలకని సామూహికంగా వెళ్లి వ్యాధి బారిన పడవద్దని మంత్రి హరీష్ రావు అన్నారు. సిద్దిపేట మెడికల్ కళాశాలలో త్వరలోనే కోవిడ్ టెస్టులు కూడా ప్రారంభిస్తామని, టెస్టుల అనంతరం ఇక్కడే వైద్యం కూడా అందిస్తామని చెప్పారు. కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి హరీష్ రావు వెల్లడించారు. అన్ని జిల్లాల్లో 100 పడకల కోవిడ్ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఇప్పటికే పలు జిల్లాల్లో కోవిడ్ ఆస్పత్రులు ప్రారంభమై సేవలు అందిస్తున్నాయని మంత్రి చెప్పారు. సిద్దిపేటలో 100 పడకల కోవిడ్ ఆస్పత్రికి అనుబంధంగా మరో 20 పడకల ఐసీయూను కూడా ప్రారంభించామని చెప్పారు. అన్ని బెడ్లకు ఆక్సిజన్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని, వెంటిలేషన్ అవసరం ఉన్న పేషేంట్లకు కూడా ఇక్కడే వైద్యం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కోవిడ్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ప్రొఫెసర్లు, డాక్టర్లను, ఇతర సిబ్బందిని నియమించామని, కరోనా వ్యాధి పట్ల ఎవరూ ఆందోళన చెంద వద్దని, భయపడవద్దు మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. కార్యక్రమం లో కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మినీ పార్కును కూడా మంత్రి ప్రారంభించారు. కోర్టు జంక్షన్ వద్ద గల క్లాక్ టవర్ చుట్టూ ఏర్పాటు చేసిన మినీ పార్కును మంత్రి ప్రారంభించారు. రూ. 4 లక్షల వ్యయంతో సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ పార్కును అభివృద్ధి చేసింది.

కూన కుటుంబానికి పరామర్శ..



కుత్బుల్లాపూర్ (శుభ తెలంగాణ) : మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూన శ్రీశైలంగౌడ్ సోదరుని ధర్మపత్ని శ్రీమతి సౌజన్య ఇటీవల అకాల మరణం చెందటం జరిగింది. బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు రేవంత్‌రెడ్డి మరియు మేడ్చల్ జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ వైస్ చైర్మన్ తోటకూర జంగయ్యయాదవ్ శ్రీశైలంగౌడ్ నివాసానికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..

రూ.30 వేల ఆర్థిక సాయం..



కుత్బుల్లాపూర్ (శుభ తెలంగాణ) :

ప్రార్తించే పెదవుల కన్నా సాయం చేసే చేతులుమిన్న అనే నానుడిని నిజం చేశారు దూలపల్లిలోని వీకర్స్ కాలనీకి చెందిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు. కాలనీలోస్థానికంగా నివాసం ఉండే కుమ్మరి నాగరాజుకి తల్లిదండ్రులు లేరు. తన ముగ్గురి అక్కలలో చివరి అక్క పెళ్లి ఈ నెల 22వ తేదీన నర్సాపూర్ కి చెందిన నాగార్జున తో నిశ్చయించారు.అయితే వివాహం జరిపించడానికి ఆర్థిక స్థోమత లేని నాగరాజు దీన స్థితిని చూసి సాయం చేయడానికి ఫ్రెండ్స్ యూత్ సభ్యులు మానవత దృక్పథం తో ముందుకు వచ్చారు. ఈ మేరకు యూత్ సభ్యులు పూజారి మహేశ్, కిరణ్ కుమార్, దేవి శివాజీ, పూజారి నరేష్ ఆధ్వర్యంలో నాగరాజు పెద్ద అక్క బుజ్జికి 30 వేల రూపాయల ఆర్థిక సాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

బంగారం అక్రమ రవాణాపై నిలదీస్తాం

తిరువనంతపురం,జూలై15 : రాష్ట్ర ప్రభుత్వం, స్పీకర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని కేరళలోని ప్రతిపక్ష నేత రమేష్ చెన్నితల తెలిపారు. బంగారం స్మగ్లింగ్ కేసులో మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శిని కాపాడేందుకు సీఎం విజయన్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో ఈ వ్యవహారంతో సీఎం కార్యాలయానికి సంబంధం ఉన్నదన్నారు. బంగారం అక్రమ రవాణా కేసులో స్పీకర్ ప్రమేయం కూడా ఉన్నదని రమేశ్ చెప్పారు. దీంతో ప్రభుత్వంతోపాటు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని తెలిపారు.

కొండెక్కుతున్న.. కూరగాయల ధరలు

హైదరాబాద్,జూలై 15(శుభ తెలంగాణ):కరోనాతో ఇప్పటి వరకు ప్రజలంతా ఎక్కువ కాలం ఇంటికే పరిమితం కావడంతో ధరలు తగ్గినట్లు గా కనిపిం చిన కూరగాయల ధరలు మళ్లీ మెల్లగా కొండెక్కుతున్నాయి. మళ్లీ ధరలన్నీ 80 నుంచి వందకు చేరువలో ఉన్నాయి. బీన్స్ కిలో 80 పలుకుతోంది. చిక్కుడు కూడా అదే ధర పలుకుతోంది. ఇకపోతే అన్ని కూరగాయల ధరలు 60కి తక్కువగా లేవు. నిన్నమొన్నటి వరకు అతి తక్కువగా ఉన్న టమాటా ధరరోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం 60లకు విక్రయి స్తుంటే.. బహిరంగ మార్కెట్‌లో మాత్రం కిలో టమాట రూ.70 పలుకు తోంది. రైతు బజార్‌లో టమాట తక్కువ ధరకు వస్తోంది. అక్కడ వెంటనే అమ్ముడు పోవడం..తద్వారా అక్కడ టమాట లేక పోవడంతో వినియోగ దారులు బహిరంగ మార్కెట్ వైపు మళ్లుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో టమాట కొనుగోలు చేయక తప్పడం లేదని వినియోగదారులు వాపో తున్నారు. మరోవైపు జిల్లాల నుంచి దిగు మతులు తగ్గాయి. నగర పరిసర ప్రాంతాల్లో పండించిన కూరగాయలను ఇక్కడికే తీసుకొస్తారు.ప్రస్తుతం జిల్లాలో టమాట పంట సాగు లేకపోవడం తో ఇక్కడి వ్యాపారులు హైదరా బాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇదికూడా అరకొరగానే దిగు మతి కావడం..డిమాండ్ ఎక్కువగా ఉ ండడంతో రోజురోజుకూ ధర పెరుగుతోంది. ప్రస్తుతం టమాటతో పాటు ఇతర కూరగాయల ధరలు సైతం పెరుగుతున్నాయి. కరోనా లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయి ఇబ్బందు లు పడుతూ కూరగాయలను అధిక ధరలకు కొనుగోలు చేయలేక పోతున్నామని వినియోగదారులు ఆవేదన చెందు తున్నారు. మరోవైపు కొందరు కూరగయాలను అమ్మేందుకు చోటా వ్యాపారులగా మారారు.

కరోనా భయంతో గాంధీభవన్‌కు తాళం

హైదరాబాద్,జూలై 15(శుభ తెలంగాణ):కాంగ్రెస్ నేతలను కరోనా వెంటాడు తోంది.రోజురోజుకు కాంగ్రెస్ పార్టీలో కరోనా బాధితులు పెరుగుతున్నా రు. వీహెచ్ హనుమంతరావు, గూడూరు నారాయణరెడ్డి, బలమూర్ వెంకట్ కరోనా బారినపడి కోలుకున్నారు.తాజాగా గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ బాధ్యుల్లో ఇద్దరికి కరోనా సోకింది. కరోనాతో మాజీ మైనారిటీసెల్ నాయకులు సిరాజుద్దీన్, టీపీసీసీ కార్యదర్శి నరేందర్‌మృతి చెందారు. ఇటీవలే కరోనా బారిన పడ్డ రోగుల కు సహాయ కార్యక్రమాల్లో నరేందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోనే ఆయన కరోనా సోకిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నరేందర్ మృతితో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది.ఇటీవల గాంధీ భవన్‌లో జరిగిన అన్ని కార్యక్రమాల్లో నరేందర్ పాల్గొన్నారు. నేతల మరణాలతో టీపీసీసీ అలెర్ట్ అయింది.వారం రోజులపాటు గాంధీ భవన్‌లో కార్యక్రమాలు నిర్వహించకూడదని నిర్ణయం తీసుకున్నారు.

మీరాలం మండి ఆలయంలో..

నాయిని నర్సింహారెడ్డి పూజలు

హైదరాబాద్,జూలై 15(శుభ తెలంగాణ):బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం మీరాలం మండి మహంకాళేశ్వరి దేవాలయంలో శాకాంబరీ అలంకరణ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. నిజాం కాలం నుండి నగరంలోని ప్రజలకు అన్ని రకాల కూరగాయల సరఫరాకు ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందిన మీరాలం మండిలో ప్రతి సంవత్సరంబోనాలజాతర ఘనంగా నిర్వహించారు.ఈరోజుమాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సిబ్బంది సమ్మెతో ఇబ్బంది

- కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



హైదరాబాద్,
జూలై 15(శుభ తెలంగాణ):

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెకు దిగిన సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి పోరుగు సేవల సిబ్బంది ఆందోళనలను కొనసాగిస్తున్నారు. వర్షంపడుతున్నా లెక్క చేయకుండ వారు తమ ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను సానుభూతితో పరిశీలించాలని వారు సిఎం కెసిఆర్‌ను కోరారు. వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ సహా వివిధ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ గాంధీ ఆసుపత్రి పోరుగుసేవల సిబ్బంది గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి కరోనా బాధితులను కాపాడుతున్నా సరైన వేతనాలు ఇవ్వట్లేదని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ నర్సులు, పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బంది విధులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించడంతో గాంధీ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిచిపోయి రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఓపీ, ఇతర వార్డుల్లో రోగులకు సేవల్లో అంతరాయమేర్పడింది. సెక్యూరిటీ, శానిటైజేషన్, ఫోర్త్ క్లాస్ పేషేంట్ కేర్ సిబ్బంది విధులు బహిష్కరించారు. తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలంటూ ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే వారం రోజులుగా నిరవధిక సమ్మెలో 600 మంది నర్సులు పాల్గొన్నారు. దీంతో కరోనా పేషెంట్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విధులకు హాజరు కావాలని, సమస్యలు పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం కోరినా ఉద్యోగులు ససేమిరా అంటున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు విధుల్లో చేరమని చెబుతున్నారు. గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మంగళవారం విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే.

వీసాల రద్దు ప్రతిపాదనను వెనక్కి

- ఒత్తిడికి తలొగ్గిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, జూలై15 :

కరోనావైరస్ కారణంగా ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యే విదేశీ విద్యార్థులు దేశం విడిచి వెళ్లాలనే వివాదాస్పద నిర్ణయాన్ని అమెరికా ప్రభుత్వం రద్దు చేసింది. యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) జూలై 6న ప్రకటించిన ఈ విధానానికి వ్యతిరేకంగా హార్వర్డ్ ,ఎంఐటి తదితర విశ్వవిద్యాలయాలు అనేక ఇతర సంస్థల సహకారంతో కోర్టుకు వెళ్లాయి. ఈ కేసును పరిశీలించిన ఫెడరల్ న్యాయమూర్తి అల్లిసన్ బురోస్.. అమెరికా ప్రభుత్వం తన నిర్ణయాన్ని రద్దు చేయడానికి అంగీకరించిందని తెలిపారు. ఐసీఈ ఉత్తర్వుల ప్రకారం.. ఎవరైతే విద్యార్థులు తమ తరగతులకు ఆన్‌లైన్‌లో మాత్రమే హాజరవుతున్నారో వారందరూ తమ వీసాలను క్యాన్సిల్ చేసుకొని దేశం విడిచి వెళ్లాలని తెలిపింది. ఇది కుదరకపోతే.. వ్యక్తిగతంగా పాఠాలు బోధించే కళాశాలకు మారాలని ఐసీఈ తెలిపింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హార్వర్డ్, ఎంఐటి కోర్టును ఆశ్రయించాయి. ఈ ఉ త్తర్వుల వల్ల విద్యార్థులకు వ్యక్తిగతంగా,ఆర్థికంగా కూడా భారీ నష్టాన్ని కలిగిస్తాయని విశ్వవిద్యాలయాలు తమ దావాలో పేర్కొన్నాయి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ప్రకారం.. 2018-19 విద్యా సంవత్సరానికి గాను యూఎస్ లో పదిలక్షలకు పైగా విదేశీ విద్యార్థులు ఉన్నారు. అమెరికా తన నిర్ణయాన్ని వెనకకు తీసుకోవడం పలు దేశాలలోని విద్యార్థులకు శుభపరిణామంగా చెప్పుకోవచ్చు. కరోనా మహమ్మారి వల్ల కళాశాలలు తెరవడానికి భయపడుతున్న విద్యాసంస్థలపై ఒత్తిడి తెచ్చేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌజ్ వర్గాలు భావిస్తున్నాయి.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎన్ సబిత..

మేడ్చల్,
జూలై 15(శుభ తెలంగాణ):

కరోనా ఇబ్బందుల్లో తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని మొత్తం పౌరసమాజానికి నిరంతరం సేవలందిస్తున్న గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే పర్మనెంట్ చెయ్యాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎన్ సబిత డిమాండ్ చేశారు. ఘట్కేసర్ మండలం కాచవాని సింగారం, ప్రతాప్ సింగారం గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి కరోనా లో పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్ సబిత మాట్లాడుతూ కరోనా వైరస్ తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సందర్భములో అకాల వర్షాలకు నానుతూ గ్రామాలను పరిశు భ్రముగా ఉంచుతూ అన్ని రకాల సేవలందిస్తున్నారని అన్నార. పారిశుధ్య కార్మికుల గురించి సామాజిక మాధ్యమాలలో పొగుడుతున్నారని దాని ద్వారా వారికి కడుపు నిండదని ప్రభుత్వం చాలా ఏండ్లుగా వెట్టిచాకిరి చేపించుకుంటుం దన్నారు. ప్రభుత్వం కనీస వేతనం తక్షణమే అమలు చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని చెప్పారు. సీఎం గిఫ్ట్ ఐదు వేల రూపాయలు ఇంకా అందరూ కార్మికులకు అండలేదన్నారు. వెంటనే పిఎఫ్ ఈఏస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 11 గ్రామాలలో సమావేశాలు నిర్వహించినట్లు ఆమే తెలిపారు. ఈ సమావేశాలలో గ్రామ పంచాయతి వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్ నర్సింహా,ముత్తమ్మమల్లేష్, ఎల్లమ్మ, శోభ, లక్ష్మమ్మ, ఐలమ్మ, అశోక్, సుకన్య, గంగమ్మ, అరుణ లావణ్య జగన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా..

మొక్కలు నాటిన నటీనటులు

హైదరాబాద్, జూలై 15(శుభ తెలంగాణ): రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన మూడో విడత గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో సెలబ్రిటీలు, నటులు ,వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని మొక్కలు నాటుతున్నారు. గచ్చిబౌలి లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో జబర్దస్త్ టీంసభ్యులైన అదిరే అభి, కెవ్వు కార్తిక్, రాజమౌళి, పొట్టి నరేష్, అప్పారావు, శ్రీమతి లక్ష్మి అప్పారావులు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు పెంచడం మనం దరి బాధ్యత అని మొక్కలు లేనిదే మానవాళి లేదని అన్నారు. రోజురోజుకు వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని దీన్ని నివారించాలం టే మనం దరం కూడా మొక్కలు పెంచే బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. కరోనా వైరస్ కారణంగా మనందరం ముక్కులకు మాస్కులు పెట్టుకొని తిరుగుతున్నామని రాబోయే రోజుల్లో మనం మొక్కలు పెంచడాన్ని నిర్లక్ష్యం చేస్తే వాతావరణ కాలుష్యం పెరిగి ప్రతి ఒక్కరు మన వీపున ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకొని తిరగాల్సి వస్తుంది అని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం కోసం ప్రచారకర్తలగా మా బాధ్యత నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా మా మిత్రులకు ఈ చాలెంజ్ ఇచ్చి మొక్కలు నాటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజమౌళి మొక్కలపై ఒక చక్కని గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, ప్రతినిధి కిషోర్ గౌడ్ పాల్గొన్నారు

కొత్త జిల్లాల ఏర్పాటుకు ఏపీ కేబినేట్ నిర్ణయం

- సిఎస్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ప్రస్తుత 13 జిల్లాలను విభజించి 26 జిల్లాల ఏర్పాటు
- రాయలసీమ కరవు నివారణ కోసం రూ.40వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు..
- వైద్యశాఖలో 9712 మంది నియమాకానికి ఆమోదం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత

అమరావతి,
జూలై 15(శుభ తెలంగాణ):

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జిల్లాల ఏర్పాటు చేయాలని గతంలోనే సిఎం జగన్ ప్రకటించారు. ఈ మేరకు సిఎస్ అధ్యక్షతన కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.. దీనికోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్ష తన కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం మంత్రివర్గ సమావేశం జరిగింది ఈ సమా వేశంలో పలు కీలక విషయాలపై చర్చించి ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న13జిల్లాల ను పునర్వవ్యవస్థికరించి 25 జిల్లాల ఏర్పాటుకు చర్చకు రాగా 26వ జిల్లాగా అరకుపై కూడా చర్చ వచ్చిందన్నా రు. కొత్త జిల్లాలతో స్థానిక ఎన్ని కలకు ఎలాంటి ఇబ్బందులు ఉం డవని ఆయన స్పష్టంచేశారు.కొత్త జిల్లాల ఏర్పాటులో పాలనాపరం గా ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించినట్లు పేర్కొన్నారు. కొత్త జిల్లాలతో స్థానిక ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటులో పాలనాపరం గా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. కేబినేట్ నిర్ణయాలను మంత్రి పేర్ని నాని మీడియాకు వివరించారు. పాలనా సౌలభ్యంతో పాటు ప్రజలకు చేరువగా ఉండేలా కొత్త జిల్లాల ఏర్పాటుకై అధ్యయన కమిటీని ఏర్పాటు చేసేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు కానున్న ఈ కమిటీలో సీసీఎల్ఏ కమిషనర్, జీఏడీ సర్వీసుల సెక్రటరీ, ప్లానింగ్ విభాగం సెక్రటరీ, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రతినిధి, కన్వీనర్‌గా ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో 25 జిల్లాల ఏర్పాటుకు కమిటీ అధ్యయనం చేయనుంది. రాయలసీమ కరవు నివారణ కోసం రూ.40వేల కోట్లతో కార్పొరేషన్,ఫిష్ ఫీడ్ క్వాలిటీ కంట్రోల్ చట్టం కోసం ఆర్డినెన్స్ తేవాలని క్యాబినేట్ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఆక్వా రంగంలో నాణ్యమైన మేత తయారీ కోసం ఆర్డినెన్స్ తెస్తున్నామని అన్నారు. ఇసుక అక్రమ రవాణ నివారణకు శాండ్ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైద్యశాఖలో 9712 మంది సిబ్బంది నియమాకానికి క్యాబినేట్ ఆమోదం తెలిపిందని వివరించారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా అదనంగా 8.21 లక్షల మందికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం నాలుగేళ్లలో రూ. 6163.59 కోట్లు కేటాయించి.. 45-60 ఏళ్ల మధ్య మహిళలకు నాలుగు విడతల్లో రూ. 75 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ అగ్రికల్చరల్ ల్యాండ్ యాక్ట్ 2006 సవరణ, ప్రత్యేక ఇసుక కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం మంత్రి పేర్ని నాని కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. పాఠశాలల్లో నాడు -నేడు కార్యక్రమానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలు, కాలేజీలు, హాస్టళ్లను నాడు -నేడు కింద అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. అదేవిధంగా స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్‌లో 28 పోస్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల అభ్యర్థుల ఖరారుపై సీఎం నిర్ణయిస్తారని వెల్లడించారు. రాష్ట్రంలోని కోవిడ్ ఆస్పత్రులో వైద్యపరంగా ఎక్కడా సమస్యలు లేవని అన్నారు. రాజధాని తరలింపు అంశం మంత్రివర్గం లో చర్యకు రాలేదని ఆయన మంత్రి నాని తెలిపారు.

చైనా ప్రపంచాన్ని మోసం చేసింది

- దానితో మాట్లాడే అవసరం మాకు లేదు
- మరోమారు తెగేసి చెప్పిన ట్రంప్

వాషింగ్టన్, జూలై15 :

కరోనా వైరస్ విషయంలో చైనా మీద ఆగ్రహం వ్యక్తం చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి తన కోపాన్ని ప్రదర్శించారు. చైనాతో మాట్లాడే ఆలోచన తనకు లేదన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. 'లేదు.. నేను అతనితో(జిన్‌పింగ్) మాట్లాడను. వారితో మాట్లాడే ఆలోచన కూడా నాకు లేదు. కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో వారు విఫలమయ్యారు. చైనాతో గొప్ప వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. జనవరిలోనే ఫేస్1 అగ్రీమెంట్‌పై సంతకాలు కూడా అయ్యాయి. సిరా ఇంకా ఆరకముందే వారు మమ్మల్ని కరోనా వైరస్‌తో దెబ్బ తీయాలని చూశారు. అందుకే మరో తప్పు చేయకూడదు అనుకుంటున్నాను. వారు వైరస్ గురించి దాచి పెట్టారు.. ప్రపంచం మీదకు వదిలారు. కరోనా వల్ల ప్రపంచానికి కలిగిన నష్టానికి చైనానే బాధ్యత వహించాలి' అన్నారు. అంతేకాక ప్రపంచ ఆరోగ్య సంస్థ మీద కూడా ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్ల్యూహెచ్ఓ చైనా తోలుబొమ్మ అన్నారు. అంతేకాక 'మా ప్రభుత్వం చాలా ముందుగానే చైనా, యూరోప్ నుంచి ప్రయాణాలను బ్యాన్ చేసి చాలా మంచి నిర్ణయం తీసుకుంది. ఇలా చేసి మేం చాలామంది ప్రాణాలు కాపాడం. ప్రజలంతా ఒక విషయం గమనించాలి.. చైనాపై పొరాడటానికి, కరోనా నుంచి ప్రజలను కాపాడటానికి మేం సమాఖ్య ప్రభుత్వ పూర్తి శక్తిని ఉపయోగిస్తున్నాం' అన్నారు. అతి త్వరలోనే కరోనా వైరస్‌కు వ్యాక్సిన్‌ను కూడా తీసుకొస్తామని ట్రంప్ తెలిపారు. అదే విధంగా డెమొక్రటిక్ అభ్యర్థి జో బిడెన్‌పై కూడా ట్రంప్ ఆగ్రహం వ్యక్తం



చేశారు. 'చైనా మన ప్రత్యర్థి అనే ఆలోచన వింతైనదని ఆయన అన్నారు. అతను చైనా అసలు ప్రాబ్లమ్ కాదు అన్నారు. గత 25, 30 ఏళ్ల నుంచి చైనా ఇబ్బంది పెట్టినంతగా ఎవరు మనల్ని ఇబ్బంది పెట్టలేదు. చైనా పట్ల కఠినంగా ఉండాల్సిన సమయంలో ఆయన దానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడటం లేదని ఆరోపించారు.

పేదల సంకల్పం నెరవేరుస్తాం

హైదరాబాద్,
జూలై 15(శుభ తెలంగాణ):

రెండుపడకల ఇళ్ల నిర్మాణాలపై కొందరు పనిగట్టుకునిచేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. సిఎం కెసిఆర్ ఈ విషయంలో ధృఢవైఖరితో ఉన్నారని అన్నారు. రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించామని పేర్కొన్నారు. నిరుపేదలకు గూడు కల్పించేందుకు తలపెట్టిన రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఇప్పటికే పాలనా పరమైన అనుమతులు జారీ చేసిన ఇళ్లలో బిడ్‌లు దాఖలై,నిర్మాణాలు సాగుతున్నాయని అన్నారు. పేదలకు ఆవాసం కల్పించేందుకు ప్రభుత్వం నిర్మించనున్న రెండు పడకల ఇళ్ల పనులను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించామని ప్రకటించారు. ప్రజల కష్టాల నుంచి భవన నిర్మాణరంగ కూలీల ఉపాధిపై ప్రభావం వరకు గల ఇబ్బందులను వివరించారు. రెండు పడకల ఇళ్లపై ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టిసారించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంలో సగమైనా పూర్తి చేయాలని భావిస్తున్నారు. నిర్మాణ సంస్థలు ముందుకు రాకపోవడంతో పనుల్లో కొంత జాప్యం జరిగింది. దీనిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఏర్పాటుచేసిన రూ.5కే భోజన కేంద్రాలను పేదలు ఆశ్రయిస్తున్నారు. దీంతో మరిన్ని కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వస్తామని మంత్రి అన్నారు. ఈ కేంద్రాల సంఖ్యను 150కి పెంచితే రోజూ 45వేల మంది ఆకలి తీరనుంది. ఒక్కొక్కరి భోజనానికి రూ. 27.50 ఖర్చవుతుండగా.. జీహెచ్ఎంసీ రూ.22.50 భరిస్తోంది. వినియోగదారుడి నుంచి ఐదు రూపాయలు వసూలు చేస్తోంది. ఈ కేంద్రాల్లో ఎక్కువగా కార్మికులు భోజనం చేస్తుంటారు. ఈ కష్టకాంలో ఇది వీరికి ఆసరగా ఉందని తలసాని అన్నారు.

ఎమ్మెల్యే నుంచి ప్రాణహాని ఉంది

- మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన కుటుంబం

హైదరాబాద్,
జూలై 15(శుభ తెలంగాణ):

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని నల్గొండ జిల్లా మర్రిగూడం లెంకలపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. తమ పేరు మీద ఉన్న భూమిని లెంకలపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్‌లు కబ్జా చేస్తున్నారని రైతు యాదయ్య కమిషన్‌కు వివరించారు. ప్రశ్నించినందుకు తనను తన తండ్రిని, తమ్ముడిపై కత్తులతో, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జూన్ 6న మర్రిగూడం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశామని, ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని యాదయ్య వాపోయారు. కేసు ఎందుకు నమోదచేయలేదని పోలీసులను ప్రశ్నించామని తెలిపారు. దీంతో రాజీ కుదుర్చుకోవాలని లేదంటే తమపైనే అక్రమ కేసులు పెడుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు వాపోయాడు. పోలీసుల నుండి సర్పంచ్ నుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కమిషన్‌ను యాదయ్య వేడుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు మరణిస్తే..

కుటుంబంలో ఉద్యోగం : సిఎ మమతా

కోల్‌కతా,జూలై15 : ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు ఎవరైనా కోవిడ్-19 కారణంగా మరణిస్తే వారి ఇంటిలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల యంత్రాంగంతో బుధవారం ఏర్పాటు చేసిన వర్చువల్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. కోవిడ్-19 అన్ని రంగాల్లోనూ వ్యాపించింది. ప్రభుత్వ ఉద్యోగులు చాలా మంది ఈ వైరస్ బారిన పడ్డారు. ఎవరైనా కోవిడ్-19 వల్ల మృతిచెందితే వారి కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో ఇప్పటి వరకు 268 మంది పోలీసులకు 30 మంది డాక్టర్లకు 43 మంది నర్సులకు 62 మంది ప్రభుత్వ అధికారులకు కరోనా వైరస్ సోకిందని మమతా బెనర్జీ తెలిపారు.

ఖర్చులను తగ్గించుకునే యత్నంలో..

ఎయిర్ ఇండియా నిర్ణయం

న్యూఢిల్లీ,జూలై15 : ఎయిర్ ఇండియా బోర్డు కీలక నిర్ణయం తీసుకున్నది. వేతనం లేకుండా ఉద్యోగుల దీర్ఘకాల సెలవు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈపథకం కింద ఉద్యోగులు ఆరు నెలల నుంచి రెండు ఏండ్లపాటు వేతనం లేని సెలవులు పొందవచ్చు. దీన్ని ఐదేండ్ల వరకు పొడిగించుకోవచ్చు. అప్పుల ఊబిలో కురుకుపోయిన ఎయిర్ ఇండియా ఖర్చులను తగ్గించుకునే దిశగా పలు ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో భాగంగా ఈ ప్రతిపాదనకు ఆ సంస్థ బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎయిర్ ఇండియాను పూర్తిగా వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించింది. అయితే ఈ సంస్థను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

ఆర్టీసీ ఇడి వెంకటేశ్వర రావు మృతి

హైదరాబాద్,జూలై15(శుభ తెలంగాణ): టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్ అండ్ మెడికల్) టీ వెంకటేశ్వర్ రావు బుధవారం కన్నుమూశారు. వెంకటేశ్వర్ రావు మృతి పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్,ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ సంతాపం తెలిపారు. రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. రావు చిత్ర పటానికి ఆర్టీసీ ఉద్యోగులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అజయ్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఓమంచి నిబద్ధత గల అధికారిని కోల్పోయిందని తెలిపారు. ఆయన కుటుంబానికి కార్పొరేషన్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వెంకటేశ్వర్ రావు గతంలో డిపో మేనేజర్, డివిజనల్ మేనేజర్, ఓఎస్డీ, రీజినల్ మేనేజర్, చీఫ్ పర్సనల్ మేనేజ్గా ఆర్టీసీలో సేవలందించారు.ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

బిఎస్ఎఫ్‌లో 68మందికి కరోనా

న్యూఢిల్లీ,జూలై15 : బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ విభాగంలో కరోనా వైరస్ కలకలం రేపుతోంది.గడిచిన 24గంటల్లో కొత్తగా 68 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. 48మంది ఈ వైరస్ నుంచి కోలుకున్నారు. బీఎస్ఎఫ్‌లో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2,093కు చేరుకోగా యాక్టివ్ కేసులసంఖ్య 1,024.ఈ వైరస్ నుంచి 1,060 మంది జవాన్లు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. దేశ వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 9,41,630కి చేరింది. ఇప్పటి వరకు 24,370 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం పాజిటివ్ కేసుల్లో 3,22,148 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. 5,94,723 మంది ఈ వైరస్ నుంచి కోలుకున్నారు.

గాంధీభవన్‌కు కరోనా ఎఫెక్ట్

హైదరాబాద్, జూలై 15(శుభ తెలంగాణ):

నగరంలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌లో కరోనా కలకలం మొదలైంది. కరోనా కంట్రోల్ రూమ్‌లో పనిచేసిన సిబ్బందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వారం రోజుల పాటు గాంధీ భవన్ మూసివేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. జీహెచ్ఎంసీ సిబ్బంది గాంధీభవన్‌కు చేరుకుని శానిటైజేషన్ చేస్తున్నారు. ఇటీవల పలువురు కాంగ్రెస్ నేతలు కరోనా బారినపడి కోలుకున్న విషయం తెలిసిందే.

మన్యంలో పోలీసుల కూంబింగ్..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (శుభ తెలంగాణ) : మణుగూరు రాష్ట్రంలోకి మావోయిస్టులు ప్రవేశించారనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు అటవీ ప్రాంతంలో 500 మంది పోలీసులు 25 బృందాలుగా ఏర్పడి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా బుధ వారం ఉదయం 9గంటలకు మల్లెపల్లితోగు అటవీప్రాంతంలో మావోయిస్టులకు మరియు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. అనంతరం పోలీసులను చూసి వారికి సంబంధించిన సామాగ్రిని వదిలిపెట్టి పారిపోయిన మావోయిస్టుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

రైతువేదిక నిర్మాణానికి శంకుస్థాపన

- పాల్గొన్న మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి..



వికారాబాద్ జిల్లా (శుభతెలంగాణ): తాండూరు నియోజకవర్గ పరిధిలోని, కోట్ పల్లి మండలం బుగ్గాపూర్ గ్రామంలోరైతు వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు బోయలక్ష్మీ వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పతంగే మంజుల పాండు, రైతు బంధు అధ్యక్షుడు లక్కాకులమల్లేషం ,మండలమాజీఅధ్యక్షుడు లింగయ్య, నాయకులు ఉప్పరి మహెందర్, పతంగే పాండు మత్స్య సహకారసంఘం నాయకులు ఆనంద్, చైర్మన్ బొజ్జ యాదగిరిఉపసర్పంచ్ శ్రీనివాస్, మల్లేశం, వార్డు మెంబర్‌లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు,నాయకులు అధికారులు బుగ్గాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి కార్మికులకు వ్యక్తిగత..

రక్షణ పరికరణల కిట్టుల పంపిణి



సంగారెడ్డి జిల్లా : రామచంద్రపురం మండలం 112 డివిజన్‌లో ఉన్న వార్డ్ కార్యాలయంలో ప్రభుత్వం సహకారంతో జిహెచ్ఎంసి కార్మికుల సుమారు 18 మంది ఎంటమోలోజి డిపార్ట్మెంట్, 70 మంది జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరణల కిట్టుల పంపిణి చేసిన 112 డివిజన్ కార్పొరేటర్ తొంట అంజయ్య.7000/-తో సేఫ్టీ కి సంబందించిన మాస్కులు, సేఫ్టీ జాకెట్, రైన్ కోర్ట్, గ్లోవ్స్, సబ్బులు, శానిటైజర్ ఇంకా ఇతర ఇతర సమస్లు ఇయ్యడం జరిగింది. వారితో జిహెచ్ఎంసి శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు గోవర్ధన్, రజిని, హేమలత, చంద్రకళ, శోభా తదితరులు. మొత్తం 5లక్షల ఖరీదు చేసే వ్యక్తిగత రక్షణ పరికరణల కిట్ బుధవారం పంపిణి చెయ్యడం జరిగింది అని కార్పొరేటర్ అంజయ్య తెలిపారు.

తూర్పు హైదరాబాద్‌కు మరిన్ని ఐటి పరిశ్రమలు

-ఐటి శాఖామంత్రి కె.తారక రామారావు
- పరిశ్రమ స్థలాలను ఐటి పార్కులు, కార్యాలయాల అభివృద్ధి చేసేందుకు అవసరం అయిన కన్వర్షన్ పత్రాలను 5 కంపెనీలకు అందజేసిన మంత్రి
- అందుబాటులోకి రానున్న మరో 25 లక్షల చదరపు అడుగులు ఐటి కార్యాలయ స్పేస్
- 30 వేల మంది ఉద్యోగులు పనిచేసేందుకు అవకాశం
- త్వరలోనే హైదరాబాద్ గ్రోత్ ఇన్ డిస్పర్శన్ (గ్రిడ్) కార్యక్రమ మార్గదర్శకాలు
- ఈస్ట్‌హైదరాబాద్‌లో ఐటిపరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలు, వసతుల కల్పనపైన సమీక్ష



హైదరాబాద్,
జూలై 15(శుభ తెలంగాణ):

హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధి కోసం నగరం నలు మూలలా అభివృద్ధి చెందెలా తమ ప్రభుతం ప్రయత్నం చేస్తున్నదని ఐటి శాఖామంత్రి కె.తారక రామారావు అన్నారు. బుధవారం హైదరాబాద్ గ్రోత్ ఇన్ డిస్పర్శన్ (గ్రిడ్) కార్యక్రమంలో భాగంగా ఐటీ కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఉప్పల్ ఏన్‌యస్ఏల్ ఐటి సెట్‌లో సమావేశం అయ్యారు. ఐటి, ఐటి అనుబంధ కంపెనీలను హైదరాబాద్ నగరం నలుమూలలకు విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా ఈస్ట్ హైదరాబాద్ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న ఐటీ కంపెనీలతో పాటు భవిష్యత్తులో రానున్న ఐటీ కంపెనీల ఏర్పాటు వాటికి సంబంధించిన మార్గదర్శకాలను పైన ఈసమావేశంలో చర్చ జరిగింది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఐటి ని నగరంలోని నలుమూలలకు విస్తరించే గ్రిడ్ పాలసీతో ముందుకు రానున్నట్లు తెలిపారు.ఈ పాలసీ ద్వారా పరిశ్రమల అభివృద్ధి అన్ని మూలలా జరుగతుందన్న నమ్మకాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఐటీ పరిశ్రమలు ఈస్ట్ హైదరాబాద్ కి తరలించే ప్రయత్నం లో భాగంగా అవసరమైన ప్రోత్సాహకాలతో పాటు మౌలిక వసతులను కల్పిస్తామని మంత్రి ఈ సమావేశంలో తెలిపారు. ఇందుకోసం అవసరమైన రోడ్లు మరియు ఇతర మౌలిక వసతుల కల్పన పైన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పారిశ్రామిక స్థలాలను ఐటీ పార్కులుగా అభివృద్ధి అభివృద్ధి చేసేందుకు అవసరమైన కన్వర్షన్ పత్రాలను 5 కంపెనీల ప్రతినిధులకు మంత్రి కేటీఆర్ అందజేశారు. ఈ ఐదు కంపెనీలు సుమారు 25 లక్షల చదరపు అడుగుల ఐటీ పార్కుల ను లేదా కార్యాలయాలకి అవసరం అయినా ఆఫీస్ స్పేస్ ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తదర్వా ఈ ఉప్పల్ ప్రాంతంలో మరో 30వేల మంది ఉద్యోగులు పనిచేసే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మాట్లాడిన మంత్రి గత ఐదు సంవత్సరాల్లో తెలంగాణ ఐటీ పరిశ్రమ జాతీయ సగటు కన్నా అధికంగా వృద్ధి చెందుతూ వస్తున్నదన్నారు. హైదరాబాద్ పట్టనం నలువైపులా సమతుల్యంగా అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇతర ప్రాంతాలకు ఐటీ పరిశ్రమను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకు వస్తున్న గ్రిడ్ విధానంతో ఐటీ పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలి వెళతాయన్న నమ్మకం ఉన్నదన్నారు. ఇప్పటికే ఇక్కడ అందుబాటులో ఉన్న మెట్రో, శిల్పారామం, మూసి నది అభివృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక మౌలికవసతుల పెరుగుతున్నాయని తెలిపారు. ఉప్పల్ నుంచి ఘట్కెస్కర్ వైపు, అంబర్ పేట్ రామాంతాపూర్ ఫ్లై ఓవర్ల ద్వారా రోడ్డు మౌళిక వసతులు మరింత పెరుగుతాయన్నారు. ఇప్పటికే నగరం నలువైపులా ఐటీ పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్, ఏరో స్పేస్, మెడికల్ డివైస్ పార్క్ వంటి వివిధ రకాల పరిశ్రమలు విసర్తించి ఉన్నాయన్నారు. అవుటర్ రింగ్‌రోడ్ లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలు దూర ప్రాంతాలకు తరలి వెళ్ళితే వారి స్థలాలను ఐటీ రంగ కార్యాలయాల అభివృద్ధికి అనుమతి ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో ఈస్ట్ హైదరాబాద్ వైపు మరిన్ని ఐటి పరిశ్రమలు వస్తాయన్న నమ్మకం వ్యక్తం చేశారు. రాచకొండ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సమాచార సంచికను మంత్రి ఈ సందర్భంగా అవిష్కరించారు.
ఈ సమావేశంలో ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, రాచకొండ కమీషనర్ మహేష్ భగవత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Edited, printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana.
Corporate Office : RamaKrishna Publictions, MIG-6, Flat No.6,Baghlingampally, Hyderabad, Telangana. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com